బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 27 జులై 2024 | www.balagamtv.com | పేజీలు 4


## గ్రేటర్‌లో 8 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు చేపట్టింది. కొత్తగా ఏర్పాటు చేసిన సెక్షన్ కార్యాలయాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు,అత్యవసర మరమ్మతులు నిర్వహించేలా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తూ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు చేశారు. గ్రేటర్ పరిధిలో ఉన్న 10 సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఇప్పటికే 205 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్ (ఎఫ్ఓసీ) ఉండగా, కొత్తగా మరో 8 ఎఫ్ఓసీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్ సేవలందిస్తాయని అధికారులు తెలిపారు.

సర్కిల్ : ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్
సికింద్రాబాద్ : బైబిల్ హౌజ్, పార్సిగుట్ట
హైదరాబాద్ : కవాడీగూడ,రాంనగర్,
సెంట్రల్ : బర్కత్‌పుర, విద్యానగర్
మేడ్చల్ : నిజాంపేట
సంగారెడ్డి అమీన్‌పూర్

# ఇక పంచాయతీ సమరం




- ఒకటి, రెండు నెలల్లో నిర్వహణ
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు




- పంచాయితీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోండి
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై నివేదిక ఇవ్వండి
- ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సాధ్యమైనంత తొందరగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ సైతం నిర్దిష్ట గడువులోగా నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని చెప్పారు.ఎన్నికల నిర్వహణకు ఎదురవుతున్న ఆటంకాలను ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కొత్త ఓటర్ల జాబితా రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందాల్సి ఉందని అధికారులు వివరించగా, జాబితా రాగానే వెంటనే ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.రాష్ట్రంలో పంచాయతీ సంస్థల ఎన్నికల నిర్వహణ, అవసరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ధరణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాంబరం కృష్ణమోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

### ఆగస్టులో ఎన్నికలు


ఆగస్టు నెల చివరి వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే ఐదేండ్ల క్రితం ఎన్నికల్లో కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం.

ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నందున రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కులగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉన్నదని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. మొత్తానికి ఈ పరిణామాల నేపథ్యంలో గత ఎన్నికల్లో కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

## పాకిస్తాన్‌కు బుద్ధి రాలేదు

- ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌ను విడిచిపెట్టం
- వాళ్ల దుర్మార్గ ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు
- దేశ ప్రధాని నరేంద్ర మోదీ
- కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పాకిస్తాన్ భారత్‌పై ఎన్నో సార్లు దాడి చేసి విఫలమైందని.. అయినా సరే వారికి ఇంకా బుద్ధి రాలేదని ప్రధాని మోడీ అన్నారు. 1999లో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరులైన వారికి యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని చెప్పారు. కార్గిల్ 25వ విజయ దివస్ సందర్భంగా లద్దాఖ్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని.. అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ చరిత్ర నుంచి పాక్ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకుండా.. ఇప్పటికి కూడా ఉగ్రవాదం, ప్యాక్సీ వార్‌తో భారత్‌పై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉందన్నారు.. పాక్ ఉగ్రవాదులను తయారు చేసి, వారిని పెంచి పోషిస్తున్నవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టమని అన్నారు భారత సైన్యం ఉగ్రవాదాన్ని నామరూపాలు లేకుండా చేస్తుందన్నారు. పాకిస్తాన్ నియంత్రణ రేఖ వద్ద నుంచి తాను ఆ దేశానికి హెచ్చరిస్తోన్నానని, భారత్‌లో అశాంతియుత వాతావరణాన్ని లేవదీయడానికి వాళ్ల చేసే దుర్మార్గపు ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించబోవని మోదీ తేల్చి చెప్పారు. అలాంటి ప్రయత్నాలకు పాల్పడితే మన సైనికులు అణిచివేస్తారని, శత్రువులకు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలువగా.. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నామని తెలిపారు. భారత దేశ బలానికి, సహనానికి, పరాక్రమానికి, వాస్తవాలకు ఈ విజయాగాథలే నిదర్శమని వెల్లడించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికులు చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగే సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం తనకి దక్కిందన్నారు. ఎందరో సైనికుల ప్రాణత్యాగాల ఫలితంగా ప్రస్తుతం జమ్ముకాశ్మీర్ ప్రశాంతంగా ఉందన్నారు. త్వరలోనే ఆర్టికల్ 370 రద్దు చేసి ఐదేళ్ల పూర్తికాబోతోందన్నారు. ఈ ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. పతిపక్షాలు అగ్నిపథ్ పథకంపై చేస్తున్న విమర్శలను మోడీ తీవ్రంగా ఖండించారు. భారత బలగాలకు సంబంధించి పెన్షన్ నిధులు ఆదా చేసేందుకే ఈ పథకం తీసుకువచ్చారంటూ చేస్తోన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మరో 7,024 ఇంజినీరింగ్ సీట్లకు అనుమతి


ఫైల్ ఫోటో

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో మరో 7,024 ఇంజనీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో మొత్తం 78,694 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా, 75,200 సీట్లు కేటాయించారు.అందులో 55,941 మంది విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా రిపోర్ట్ చేశారు. తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్టింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత 22,753 సీట్లు ఖాళీగా మిగిలాయి. తాజాగా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 7,024 సీట్లతో కలిపి రెండో విడత కౌన్సెలింగ్‌లో 29,777 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా శనివారం(జులై 27) సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు శని, ఆదివారాలు(జులై 27,28) గడువు ఇచ్చారు. ఈ నెల 31న రెండో విడత ఇంజనీరింగ్ సీట్లు కేటాయించనున్నారు.

## అదరహో..!
## ఒలంపిక్స్ ప్రారంభ వేడుకలు

ఓపెనింగ్ సెర్మనీలో ట్రెడిషనల్‌గా భారత అథ్లెట్లు
చీరకట్టులో పీవీ సింధు



**బలగం టీవి, ప్యారిస్**

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఒలింపిక్స్ చరిత్రలోనే తొలిసారి ఫ్రాన్స్‌లోని నదిలో ఆరంభ వేడుకలు నిర్వహించారు. సెన్ నది వేదికగా 6 కి.మీ పొడవునా 100 పడవల్లో 205 దేశాల క్రీడాకారులు పరేడ్ నిర్వహించారు. ఆరంభ వేడుకల్లో మొత్తం 3 వేల మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ వేడుకలో భారత అథ్లెట్లు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి ఆకట్టుకున్నారు భారత పురుష అథ్లెట్లు కుర్తా బుండీ ధరించి ఫొటోలకు పోజులిచ్చారు. మహిళా అథ్లెట్లు చీర ధరించారు. భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్, తెలుగమ్మాయి పీవీ సింధు చీర కట్టులో కనిపించి ఆకట్టుకుంది. ఈమె ఓపెనింగ్ సెర్మనీలో భారత బృందానికి ఫ్లాగ్ బేరర్‌గా ఉంది. మొత్తంగా ఈ సంప్రదాయ దుస్తుల్లోనే ఓపెనింగ్ సెర్మనీలో వీరంతా మార్చ్ చేశారు. భారతీయత ఉట్టిపడేలా త్రివర్ణ పతాకం రంగులు ఈ దుస్తులపై ఉండటం విశేషం. కాగా, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఈ ఫొటోలోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మన అథ్లెట్లను ప్రోత్సహించండి అంటూ కోరింది. ఈ విశ్వక్రీడల్లో 32 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అలానే ఈ ఒలింపిక్స్ పోటీలను భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మొత్తంగా భారత్ తరపున 117 మంది అథ్లెట్లు ఈ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు.

## చేనేత కార్మికుల
## ఉపాధికి చర్యలు తీసుకోవాలి



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోలీస్, ఆర్టీసీ, ఆరోగ్య తదితర విభాగాలు ప్రభుత్వ సంస్థల నుంచి క్లాత్‌ను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లో నిజమైన కార్మికులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు ఉండాలని ఆదేశించారు. 'ధరణి'పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు ప్రభుత్వ పరంగా అన్ని విభాగాల్లో యూనిఫామ్‌ల కోసం క్లాత్ సేకరించే వారితో ఆగస్టు 15 తర్వాత సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. మహిళా శక్తి గ్రూపు సభ్యులకు అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన డ్రెస్ కోడ్ కోసం ప్రత్యేక డిజైన్ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీపై చేపడుతున్న కార్యక్రమాలపై సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎండీ శైలజ రామయ్యర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



### ధరణి సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం

ధరణి సమస్యలపై శాశ్వత పరిష్కారం కోసం అవసరమైతే సమగ్రమైన చట్టం రూపొందించాలని ముఖ్యమం(రేవంత్ రెడ్డి చెప్పారు. ధరణిలో సవరణలు చేస్తున్న సందర్భంగా కొత్తగా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ధరణి సమస్యలపై ముఖ్యమంత్రి సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సవరణలు చేసే క్రమంలో ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.సమస్యల పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాలని, అవసరమైతే ఈ విషయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని, దీనిపై అసెంబ్లీలోనూ చర్చించి అందరి సూచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా సమగ్రమైన చట్టం రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీ కే.కేశవరావు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, రేమండ్ పీటర్, ఎం.సునీల్ కుమార్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఆగస్టు 2 వరకు సమయమిస్తున్నాం...



- కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీటిని నింపాలి
- లేదంటే 50 వేల మంది రైతులతో వచ్చి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీటిని నింపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి తామే పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీడు భూములను నీళ్ల అందిస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. కేవలం రాజకీయ కక్షతో వివరాలు 3వ పేజీలో

## నీట్ యుజి ఫలితాలు విడుదల

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

వివాదంలో కూరుకుపోయిన నీట్ యుజి వైద్య ప్రవేశ పరీక్ష అంతిమ ఫలితాలను జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ) శుక్రవారం ప్రకటించినట్లు అధికారులు తెలియజేశారు. ఒక ఫిజిక్స్ ప్రశ్నకు మార్కులను పరిగణనలోకి తీసుకున్న తరువాత సుప్రీం కోర్టు నుంచి ఆదేశాన్ని అనుసరించి ఫలితాలను ఎన్‌టీఎ ప్రకటించింది. సదరు ప్రశ్నకు సరైన సమాధానాలు రెండు ఉన్నాయని ఎన్‌టీఎ అప్పట్లో తెలిపింది.'తిరిగి సవరించిన స్కోర్ కార్డులు ఇప్పుడు లైవ్‌లో ఉన్నాయి' అని ఎన్‌టిఎ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇంతకుముందు టాపర్లుగా ప్రకటించిన 67 మంది అభ్యర్థుల్లో 44 మంది సదరు ఫిజిక్స్ ప్రశ్నకు ఇచ్చిన మార్కుల కారణంగా పూర్తి మార్కులు లభించాయి. కొన్ని పరీక్ష కేంద్రాల్లో సమయం నష్టాన్ని భర్తీ చేసేందుకు ఆరుగురు అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఎన్‌టిఎ ఉపసంహరించడంతో టాపర్ల సంఖ్య 61కి తగ్గింది.

## కమలా హారిస్‌కు ఒబామా మద్దతు



**బలగం టీవి, వాషింగ్టన్**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ వైదొలగడం వల్ల ఆ స్థానంలో కమలా హారిస్ పేరు దాదాపు ఖరారైనట్లే. ఇప్పటికే మెజారిటీ ప్రతినిధులు ఆమెకు మద్దతు పలకగా, తాజాగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతుల నుంచి మద్దతు వ్యక్తమైంది. "నేను, మిషెల్ మా స్నేహితురాలు కమలా హారిస్‌కు కొద్ది రోజుల క్రితం ఫోన్ చేశాం. ఆమె యునైటెడ్ స్టేట్స్‌కు అధ్యక్షురాలు అవుతారని మేం భావిస్తున్నాం. ఆమెకు మా పూర్తి మద్దతు ఉందని ఆమెకు తెలియజేశాం. నవంబర్?లో జరగనున్న ఎన్నికల్లో కమల గెలవడానికి ఏమైనా చేస్తాం. మీరు కూడా మాతో చేరుతారని ఆశిస్తున్నాం" అంటూ కమల హారిస్‌తో ఫోన్ మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు బరాక్ ఒబామా. "మీకు మద్దతు ఇచ్చే విషయంలో మిషెల్, నేను ఎంతో గర్వపడుతున్నాం. ఈ ఎన్నికల ప్రచారంలో మిమ్మల్ని ఓవల్ ఆఫీస్‌కు పంపే విషయంలో మేం చేయాల్సిందంతా చేస్తాం" అని కమలతో ఒబామా ఫోన్ కాల్‌లో మాట్లాడారు. "మీ విషయంలో గర్వంగా ఉంది. ఇది చారిత్రకం కానుంది" అని మిషెల్ అన్నారు. వారికి వెంటనే కమలా హారిస్ కృతజ్ఞతలు తెలియజేశారు. "ఇది నాకు ఎంతో విలువైంది" అని బదులిచ్చారు.

# గంజాయి సేవించేవారు ఇక తప్పించుకోలేరు



- గంజాయి రవాణాపై ఉక్కుపాదం..
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు గంజాయి కిట్లు అందుబాటులోకి.
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవి , రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ,సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ లతో కలిసి గంజాయి కిట్లను ఎస్పీ అఖిల్ మహాజన్ ఆవిష్కరించారు .

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పోలీస్ విన్నూత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్దని అన్నారు. గంజాయి మత్తు పదార్థాలను అక్రమ రవాణాకు చెక్ పెడుతూ గంజాయిని పట్టుకుంటున్నారే గాని వాటిని సేవించే వారిని గుర్తించడం కష్టంగా మారిందని,ఈ నేపథ్యం లో తెలంగాణ పోలీసులు.. గంజాయి తాగే వారిని గుర్తించడానికి అన్ని పోలీస్ స్టేషన్లలోకి గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులోకి తీసుకవచ్చామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే, గంజాయి టెస్ట్ లు నిర్వహించి వాటికి బానిసైన వారిని పట్టుకోవడం జరుగుతుదన్నారు.జిల్లాలో గంజాయి సేవించేవారు ఇకనుంచి పోలీసుల చేతిలో తప్పించుకోలేరని హెచ్చరించారు.

జిల్లాలో గంజాయి కిట్ల సహాయంతో గతంలో గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్న వారు వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందా లేదా అనే నేపథ్యంలో,అనుమాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, గంభీరవుపేట్ పోలీస్ స్టేషన్లలో గంజాయి కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చిన వారిని, వారికి గంజాయి సరఫరా చేసిన వారిని 08 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 390 గ్రాముల గంజాయి,05 గంజాయి సిగరెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు.

### వీటీడీఏ పనులు
# ఎక్కడి వరకు పూర్తయ్యాయి..



- వీటీడీఏ పనుల్లో వేగం పెంచాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టివి , రాజన్న సిరిసిల్ల :**

వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు,ఎక్కడి వరకు పూర్తి అయ్యాయి, వీటీడీఏ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారుల ను ఆదేశించారు.శుక్రవారం వీటీడీఏ పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ నిర్మాణ పనులను రూ. 12 కోట్లతో మొదలు పెట్టామని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. బండ్ పార్క్ పనుల్లో భాగంగా నటరాజ, సూర్య నమస్కారం విగ్రహాలు, అంఫీథియేటర్, ఇంటర్నల్ పాత్ వే, జోన్ వన్ ప్లాంటేషన్ పూర్తి కాగా, లాండ్ స్కేప్, గ్రానైట్ ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు. వీటీడీఏ పనుల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో దాదాపు ఎకరం విస్తీర్ణంలో రూ. 2 కోట్లతో మున్సిపల్ పార్క్ నిర్మాణ పనులు, వేములవాడ నియోజక వర్గంలోని తిప్పాపూర్, మారుపాకలో మోడల్ లేఅవుట్ పనులు తుది దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. శివార్చన స్టేజ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈఈ వినోద్ రెడ్డి, టూరిజం శాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం..



- జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు లేవు
- కేటాయింపులు ఖర్చుల సమతుల్యత ఉండాలి
- కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు

**బలగం టీవి , సిరిసిల్ల :**

కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో అంబెద్కర్ బంధు పెట్టి 12లక్షలకు పెంచి ఇస్తామని చెప్పి,కానీ బడ్జెట్లో దానికి నయాపైసా కేటాయించలేదని కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు అన్నారు.శుక్రవారం రాజన్న సిరిసిల్ల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు బట్టువిక్రమార్క రాష్ట్రంలో దళితులు 18శాతం ఉన్నారని 18శాతంనిధులు ఎస్సి ఎస్డీఫ్ ప్రకారం కేటాయింపు చేయాల్సి ఉండగా, బడ్జెట్లో కేవలం 14.86 శాతం నిధులు మాత్రమే కేటాయిం చారని ఆన్నారు. రాష్ట్రంలో 18 శాతం ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి మౌలిక సంక్షేమానికి ఖర్చు పెట్టగలిగితే దళితులకు కొంత ఊరట లభిస్తుందన్నారు.బడ్జెట్లో అంకెలు పెరిగితే బ్రతుకులు మారవని అవి దళితుల సంక్షేమానికి ఖర్చు పెట్టాలన్నారు. సాంఘీక సంక్షేమమం క్రింద కేవలం 33 124 కోట్ల రూ. లు కేటాయించారని అన్నారు.

రాష్ట్రంలో జిల్లాలో దళితులపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయని,దళితుల బడ్జెట్ దళితుల మౌలిక సంక్షేమానికి ఖర్చు పెట్టాలంటే ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించి,నిరంతర తనిఖీ అమలు పర్యవేక్షణ జరిగితే ఎంతో కొంత దళితుల సంక్షేమానికి తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి దళిత సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే నోడల్ ఆఫీసర్ తో పాటు,సి ఎం అధ్యక్షతన అపెక్స్ బాడీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్ని రూపాల్లో కేటాయింపులు చేసిన అందులో సగం కూడా ఖర్చు కావడం లేదని,కేవలం కేటాయింపులతో గత ప్రభుత్వం కూడా గప్పాలు కొట్ట, దళితుల బడ్జెట్ ను కాళేశ్వరం ప్రాజెక్ట్ మిషన్ భాగీరద,మిషన్ కాకతీయ వంటి వాటికి దారి మళ్లించిందన్నారు.బడ్జెట్ లో కేటాయించిన ప్రతి పైసా చిత్తశుద్ధితో దళిత సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు జంగం చందు, నాగేల్లి బానుప్రసాద్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక రవాణా దారునిపై కేసు నమోదు

- రిమాండ్ కు తరలింపు

**బలగం టీవి , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారులో గల ఓర్రె నుండి వివిధ గ్రామాలకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో తంగళ్ళపల్లి ఎస్సై.డి.సుధాకర్, సిబ్బంది కిష్టయ్య, శ్రీనివాస్, సంపత్ తో కలిసి వెళ్లి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ టి ఎస్ 23 టీ 6057 ట్రైలర్ నం.6056 గల ఇసుక ట్రాక్టర్ మీద కేసు నమోదు చేసి సీజ్ చేయడం జరిగిందని ట్రాక్టర్ యజమాని గౌరవేణి రాజు పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తంగళ్లపల్లి ఎస్సై డి సుధాకర్ తెలిపారు.ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణా సమాచారం సేకరించిన కానిస్టేబుల్ లను ఎస్సై అభినందించారు.మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే డయల్ 100 ద్వారా సమాచారం తెలపగలరని కోరారు.

### ఎల్లారెడ్డిపేటలో
# గంజాయి అమ్ముతున్న ఇద్దరు అరెస్ట్



- 100 గ్రాముల గంజాయి స్వాధీనం
- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్

**బలగం టివి, ఎల్లారెడ్డిపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇద్దరు యువకులు గంజాయి అమ్ముతూ శుక్రవారం రోజు పట్టు పడగా వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ అనే ఇద్దరు యువకులు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించుకుందామని ఆలోచనతో కరీంనగర్ కు చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయిని కొనుక్కొని ఎల్లారెడ్డిపేటలో సరఫరా చేస్తున్నారు.శుక్రవారం రోజు ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని రాయపల్లి వాగు బ్రిడ్జి వద్ద గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టు పడ్డారు.వీరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 100 గంజాయిని స్వాధీనం చేసుకొని రిమైండ్ కు తరలించడం జరిగిందని సీఐ తెలిపారు. ఎవరైనా సరే గంజాయి అమ్మిన సరఫరా చేసిన వారి పైన ప్రత్యేక నిదాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమాకాంత్, కానిస్టేబుల్ మహేందర్, శ్రీనివాస్, ఆసిఫ్, సతీష్పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# నిరుద్యోగ భృతి,జాబ్ క్యాలెండర్ ఏమైంది..

- యువతను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్....
- డీవైఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్

**బలగం టీవి , ముస్తాబాద్ :**



తెలంగాణ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతను విస్మరించిందని డీవైఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాము కానీ ప్రైవేట్ భాగస్వామ్యం కాకుండా ప్రభుత్వమే పూర్తిగా భాగస్వామ్యమై ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముసాయిదా ను తయారు చేసి మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారని,పిపిపి మోడల్ లో ఈ యూనివర్సిటీ నెలకొల్పుతామని ప్రకటించడం సరైన విధానం కాదు అని అన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్లో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీకి నిధులు కేటాయించకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏవిధంగా అందుబాటులోకి తీసుకువస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ని యూత్ డిక్లరేషన్ లో భాగంగా జాబ్ క్యాలండర్,నిరుద్యోగ భృతి ,యూత్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామని యువతకుహామీలు ఇచ్చారని,కానీ ఈ హామీల ప్రస్తావనే లేకుండా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు అని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రకటనలకు పరిమితమవుతున్నట్లుగానే ఈ ప్రభుత్వ వ్యవహారం ఉన్నది అని,తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలను సవరించి యువజన,క్రీడారంగాలను ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ మహిళా మోర్చా ఆందోళన..

**బలగం టివి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీజేపీ మహిళా మోర్చా ఆందోళనకు దిగింది. బీజేపీ మహిళా మోర్చకు చెందిన పలువురు కార్యకర్తలు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ దగ్గరగల అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందన్న రేవంత్‌రెడ్డి ఆరోపణల నేపథ్యంలో బీజేపీ ఈ ఆందోళన చేపట్టింది.శుక్రవారం మధ్యాహ్నం ట్యాంక్ బండ్ దగ్గరున్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు.. ఆందోళనకు దిగారు. 'ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడి రాజ్యం' అంటూ నినాదాలు చేశారు. 'సీఎం.. డౌన్ డౌన్' నినాదాలతో హోరెత్తించారు. దాంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో 'పోలీస్ జులుం నశించాలి' అంటూ నినదించారు.

# దేవాదాయ శాఖ అధికారిణిపై విజిలెన్స్ విచారణ..

**బలగం టీవి, హైదరాబాద్**

ఏపీలో వివాదాస్పద దేవాదాయ శాఖ అధికారిణి కె. శాంతి వ్యవహారాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అదేశించింది. ఇప్పటికే పలు ఆరోపణలతో సస్పెండ్ అయిన ఆమె వైసీపీ ప్రభుత్వ హాయాంలో పెద్ద ఎత్తున అన్యాయాలు, అక్రమాలు, అవినీతికి పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం విచారణకు అదేశిస్తూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నిర్ణయం తీసుకొన్నారు. తన భార్య శాంతి కన్న బిడ్డకు తండ్రి ఎవరో తేల్చేందుకు వైసీపీ రాజ్యసభ సభ్యుడు పి.విజయసాయి రెడ్డి, హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది సుభాష్ రెడ్డిలకు డీఎన్ఏ పరీక్షలు చేయాలంటూ ఆమె భర్త ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే.రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అండతో శాంతి విశాఖ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగంతో అక్రమాలు, అన్యాయాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. కొత్తగా దేవాదాయ శాఖలో చేరిన ఆమెకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన విజయసాయి రెడ్డి ఏకంగా నాలుగు పోస్టులు ఆమెకు కట్టబెట్టారు. విశాఖ కనకమహాలక్ష్మీ దేవస్థానంతోపాటు పలు ఆలయాల్లో శాంతి అవినీతికి పాల్పడ్డరానే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. మూడు సంవత్సరాల లీజ్‌కు ఇవ్వాల్సిన దేవాదాయ శాఖ భూములను కారు చౌకగా11 సంవత్సరాల లీజ్‌కు ఆమె కట్టబెట్టారు. వీటన్నింటిపై విచారణ జరుగనుంది.

### ఎల్లారెడ్డిపేటలో
# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనమహోత్సవం



**బలగం టీవి, ఎల్లారెడ్డిపేట**

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలనీ, పండ్లు, కాయల చెట్లు నాటడం ద్వారా అనేక జీవరాశులు బతుకుతాయనీ, పర్యావరణం పరిరక్షించబడుతుందనీ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ అన్నారు. శుక్రవారం రోజున ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ సందర్శించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పిల్లలందరు సామాన్య, పేద కుటుంబాలకు చెందిన వారనీ వారికి చక్కని విలువలతో కూడిన విద్య అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనీ అన్నారు.ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని అన్నారు.కళాశాలలో వనమహోత్సవం నిర్వహించారు. డి.ఐ.ఇ.ఒ మొక్కలు నాటారు. నేటి పరిస్థితుల్లో పర్యావరణం పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ కొనసాగుతుందనీ లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఐదుకు తగ్గకుండా మొక్కలు నాటాల న్నారు. తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్, ఇంచార్జి క్యాతం సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, ఆర్. గీత, కొడిముంజ సాగర్, అగోలం గౌతమి, చిలుక ప్రవళిక బోధనేతర సిబ్బంది విమల్ కుమార్,ఎం.డి తాజోద్దీన్, కె.దేవేందర్ మరియు లక్ష్మి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# వివో వై18ఐ ఫోన్ ఆవిష్కరణ

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వివో తన బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్ వివో వై18 ఐను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. రెండు కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉన్న వివో వై18ఐ ఫోన్ 6.56 అంగుళాల హెచ్డీ+ డిస్ ప్లే కలిగి ఉంటుంది. యూనిసోక్ టీ612 ప్రాసెసర్, 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ గా వస్తోంది. 13-మెగా పిక్సెల్ మెయిన్ సెన్సర్ కెమెరాతోపాటు డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటుంది. 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది. వివో వై18ఐ ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.7,999లకు లభిస్తుంది. జెమ్ గ్రీన్, స్పేస్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఆఫ్ లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తుంది.

వివో వై18ఐ ఫోన్ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ ఫన్ టచ్ ఓఎస్ 14 వర్షన్ మీద పని చేస్తుంది. 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.56 అంగుళాల హెచ్డీ+ (1612ఐ720 పిక్సెల్స్) ఎల్సీడీ డిస్ ప్లే కలిగి ఉంటుంది. ఆన్ బోర్డు స్టోరేజీతో 8 జీబీ ర్యామ్ పెంచుకోవచ్చు. రేర్ ఫ్లాష్ యూనిట్ తో వివో వై18 ఐ ఫోన్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటది. 13-మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ కెమెరా, 0.08 మెగా పిక్సెల్ సెకండరీ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 5-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. మైక్రో ఎస్డీ కార్డ్ సాయంతో ఆన్ బోర్డు స్టోరేజీ కెపాసిటీ 64 జీబీ వరకూ పెంచుకోవచ్చు.

వివో వై18ఐ ఫోన్ వై-ఫై, బ్లూటూత్ 5.1, జీపీఎస్, బైదూ, గ్లోనాస్, గెలీలియో, క్యూజడ్ఎస్ఎస్, ఓటీజీ, ఎఫ్ఎం రేడియో, యూఎస్బీ 2.0 పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. యాక్సెలరో మీటర్, అంబియెంట్ లైట్ సెన్సర్, ఈ-కంపాస్, ప్రాగ్జిమిటీ సెన్సర్ కలిగి ఉంటది. డస్ట్ అండ్ స్ప్లాష్ రెసిస్టెన్స్ కోసం ఐపీ54 రేట్ అందుకుంది.

# బంగారు నాణెంపై షారుఖ్ ఖాన్ చిత్రం

**బలగం టీవి, ప్యారిస్**



: ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోని గ్రెవిన్ మ్యూజియం బాలీవుడ్ సూపర్ స్టార్ షారూఖ్ ఖాన్‌ను బంగారు నాణెంతో సత్కరించింది. ఈ అరుదైన గౌరవం అందుకున్న తొలి నటుడు ఆయనే. ఈ బంగారు నాణేలు షారూఖ్ ఖాన్ యొక్క పోలికను కలిగి ఉంటాయి. దీంతో గ్రెవిన్ మ్యూజియంలో తన పేరిట బంగారు నాణేలు ఉన్న తొలి భారతీయ నటుడిగా షారూఖ్ నిలిచాడు. మహాత్మా గాంధీ తర్వాత ఈ గౌరవాన్ని అందుకున్న రెండవ భారతీయుడు బాద్‌షా షారూఖ్ కావడం విశేషం. ఈ బంగారు నాణెం ఫోటోను అభిమానుల కోసం సోషల్ మీడియాలో షేర్ చేయగా..ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. అయితే, భారతీయ సినిమా ఇండస్ట్రీకి, సామాజిక బాధ్యతతో దాదాపుగా మూడు దశాబ్దాలకు పైగా షారుఖ్ ఎన్నో విధాలైన సేవలు అందిస్తుండటంతో ఈ అరుదైన గౌరవం దక్కింది.

# అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

**బలగం టీవి, నిర్మల్**



నిర్మల్ జిల్లాలో ని ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన గంగసాగరాకు శుక్రవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది గంగసాగరాను ఆసుపత్రికి తరలించే క్రమంలో తరోడా గ్రామ సమీపంలో 108 అంబులెన్స్ లో సుఖప్రసవం జరిగి 3వ కాన్పులో పండంటి ఆడ బిడ్డను జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు సురక్షితంగా ఉన్నట్లు 108 సిబ్బంది ఈఎంటి పండరి, పైలట్ నస్రూల్లా ఖాన్, తెలిపారు. చికిత్స కోసం భైంసా ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కవితను వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచిన సీబీఐ అధికారులు

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ అధికారులు శుక్రవారం వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు. సీబీఐ కోర్టు జడ్జి సెలవులో ఉండటంతో అధికారులు మరో కోర్టులో హాజరుపరిచారు. ఢిల్లీ మద్యం కేసు విచారణను జడ్జి ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు, ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ కేసులో డీఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత వేసిన పిటిషన్‌పై జులై 22న రౌస్ అవెన్యూ కోర్టు విచరణ చేట్టింది. తదుపరి విచారణను ఆగస్ట్ 5కు వాయిదా వేసింది.

## ఆగస్టు 2 వరకు సమయమిస్తున్నాం...



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌ను బద్నాం చేయాలనే పంపులను ఆన్ చేయడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు కాళేశ్వరం పంప్‌హౌస్‌లు ఆన్ చేయాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కన్నెపల్లి లక్ష్మీ పంప్ హౌస్‌ను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులం ప్రాజెక్టును పరిశీలించామని చెప్పారు.'దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారశ్రీవష్త్రశ్రీఎఐ. తెలంగాణలో కరువు అనే మాట వినపడొద్దని ఈ ప్రాజెక్టును నిర్మించారశ్రీతీ ంఋుతీబీవఎఐ.. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ నీటి సమస్య లేదు. గతంలో నీటి సమస్య ఉండేదని రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నది. ఈ ప్రభుత్వం పంటల సాగు కోసం నీరు ఇచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్‌లో నీళ్లు లేవు, ఎల్ఎండీలో 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. మిడ్ మానేరులోనూ 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. శ్రీరాంసాగర్ సామర్థ్యం 90 టీఎంసీలు అయితే ఇప్పుడు 25 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టుతో కరువు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. హైదరాబాద్‌కు కూడా మంచినీళ్లు అందించొచ్చు. 15 టీఎంసీలతో కొండ పోచమ్మ సాగర్ కట్టుకున్నం. 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ కట్టుకున్నం. లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూడు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారు. పది లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా కిందకు పోతున్నాయి. కాళేశ్వంరం దగ్గర గోదవారి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రిజర్వాయర్లు మాత్రం గొంతెండి ఎడారిలాగా మారాయి.ఇంత గొప్ప సిస్టమ్ రూపొందించడం మరొకరి వల్ల కాదు. 17 పంపులు రెడీగా ఉన్నాయి. రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు. రాజకీయ పరమైన నిర్ణయం వల్లే నీటిని ఎత్తిపోయడంలేదు. ప్రభుత్వం తలచుకుంటే 18 లక్షల ఎకరాలకు నీళ్లివ్వొచ్చు. నీళ్లు సముద్రంలోకి వృధాగా పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బస్వాపూర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్ రైతులు నీటికోసం ఎదురుచూస్తున్నారు. తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట వరకు రైతులు కాళేశ్వర జలాల కోసం ఎదురుచూస్తున్నరు. ఆరు నెలలు రాజకీయం చేద్దాం.. నాలుగున్నరేండ్లు ప్రజల కోసం కష్టపడి పనిచేద్దాం.

నీటిని లిఫ్ట్ చేస్తే రెండు రోజుల్లో మిడ్ మానేరుకు చేరుకుంటాయి. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్లు నింపొచ్చు. మిడ్‌మానేరు గత ఐదారేండ్లు నిండుగా ఉంది. ఇప్పుడు ఎడారిగా మారింది. పంప్‌హౌస్‌లపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ చిల్లర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రజలకు ఈ విషయాలన్నీ అర్థమైపోయినయి. రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చకు డిమాండ్ చేస్తం. కాళేశ్వరంలో పరిధిలో రిజర్వాయర్లలో నీటిని నింపడానికి ప్రభుత్వానికి ఆగస్టు 2 వరకు గడువిస్తున్నాం. సర్కార్ స్పందించకపోతే 50 వేల రైతులతో తామే పంపులు ఆన్ చేస్తం. తెలంగాణ బీడు భూములకు నీళ్లు అందిస్తం. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీలో నిలదీస్తం. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని ప్రపంచమంతా గుర్తించింది. ఎందరో మేధావులు కాళేశ్వరం గొప్పతనాన్ని ప్రశంసించారు. చిన్న సమస్య తలెత్తితే ప్రాజెక్టుపై విష ప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుని అద్భుతమైన ప్రాజెక్టును నిర్మించాం. అన్నారం, సుందిళ్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. గ్రౌడింగ్ అనేది నిరంతరం ప్రక్రియ, 2020లోనూ చేశామని ఇంజినీర్లు చెప్పారు. రైతుల మీద కాంగ్రెస్ రాజకీయాలు బంద్ చేయాలి. కేసీఆర్ ఇంతగొప్ప ప్రాజెక్టును నిర్మిస్తే వాడుకునే తెలివి కాంగ్రెస్‌కు లేదు.' అని కేటీఆర్ విమర్శించారు.

# గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సీఎస్ శాంతి కుమారి
- అధికారులతో సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సీఎస్ ఆదేశించారు. డీజీపీ జితేందర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, పోలీసు, విద్యుత్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎస్ పలు సూచనలు చేశారు.

వేడుకల్లో ముందుగా ముఖ్యమంత్రి పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తారని ఆమె తెలిపారు. వేడుకల సందర్భంగా అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు,



రాజ్‌భవన్, సెక్రటేరియట్ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు.

జాతీయ పతాకం ఎగురవేసే ప్రధాన డయాస్ వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ శాఖను సీఎస్ కోరారు. ముఖ్య మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అతిథులు అందరూ చూసేందుకు వీలుగా ప్రధాన డయాస్ ఏర్పాట్లు ఉండాలన్నారు. వేడుకలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి పారిశుద్ధ్య పనులలో ఎలాంటి లోపాలు ఉండరాదని పురపాలక శాఖను ఆదేశించారు. అంబులెన్స్, నర్సింగ్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రముఖులకు, అధికారులకు, వేడుకకు హాజరయ్యేవారికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించడంతో పాటు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఫైర్ శాఖను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వెయ్యి మంది కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని కల్చరల్ డిపార్ట్‌మెంట్ అధికారులు సీఎస్‌కు తెలిపారు. సాంప్రదాయ వస్త్రధారణతో కళాకారుల ప్రదర్శనలు వేదికకు వన్నె తెచ్చేలా ఉంటాయని అధికారులు వివరించారు. వచ్చేనెల 13న ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరగనుండగా 10వ తేదీ నుంచి రిహార్సల్స్ ఉంటాయని అధికారులు వివరించారు.



## బంగారం వెండి ధరల్లో పెరుగుదల

బలగం టీవీ, న్యూఢిల్లీ

వరుసగా మూడు సెషన్లలో తగ్గిన బంగారం, వెండి ధరలు శుక్రవారం తిరిగి పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో దేశీయ బులియన్ మార్కెట్లో శుక్రవారం తులం బంగారం ధర (24 క్యారట్స్) స్వల్పంగా రూ.50 పెరిగి రూ.70,700లకు పెరిగింది. గురువారం బంగారం ధర రూ.70,650 పలికింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తెలిపిన వివరాల ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.50 పెరిగి రూ.70,700, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.70,350 వద్ద స్థిర పడింది. మరోవైపు కిలో వెండి ధర సైతం రూ.400 వృద్ధి చెంది రూ.84,400లకు చేరుకున్నది. గురువారం కిలో వెండి ధర రూ.84 వేల వద్ద స్థిర పడింది. గ్లోబల్ మార్కెట్లతోపాటు దేశీయంగా కూడా ఆభరణాల కొనుగోళ్ల గిరాకీ పెరగడంతో కూడా బంగారం ధర వృద్ధికి కారణమైందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ నెల 23న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) బడ్జెట్ సమర్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండిలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ఆరు శాతానికి కుదించడంతో మంగళవారం ఒక్కరోజే తులం బంగారం ధర రూ.3350 తగ్గి రూ.72,300లకు పడిపోగా, కిలో వెండి ధర రూ.3500 క్షీణించి రూ.87,500 వద్ద స్థిర పడింది. బుధవారం తులం బంగారం ధర రూ.500, గురువారం రూ.1000 తగ్గింది. మూడు రోజుల్లో తులం బంగారం ధర రూ.5000 తగ్గడంతో బంగారం కొనుగోలు దారులతో జ్యువెల్లరీ ఆభరణాల దుకాణాల్లో సందడి నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 2416.40 డాలర్ల నుంచి 2350 డాలర్లకు పతనమైంది. ఔన్స్ వెండి ధర న్యూయార్క్ లో 27.89 డాలర్లు పలికింది. కీలక వడ్డీరేట్లపై వచ్చే వారం యూఎస్ ఫెడ్ రిజర్వు సమావేశం కీలకం కానున్నది. యూఎస్ ద్రవ్యోల్బణం గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు.

## దేశంలో 5 కోట్లకు పైగా పెండింగ్ కేసులు

బలగం టీవీ, న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా వివిధ కోర్టులలో 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అత్యధికంగా ఉత్తర్ ప్రదేశ్‌లోని అనుబంధ కోర్టులలో 1.18 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని శుక్రవారం లోక్‌సభకు ప్రభుత్వం తెలిపింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రశ్నోత్తరాల సమయంలో లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ సుప్రీంకోర్టులో 84,045 కేసులు పెండింగ్‌లో ఉండగా వివిధ హైకోర్టులలో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

పెండింగ్ కేసులు అత్యధికంగా జిల్లా, అనుబంధ కోర్టులలోనే ఉన్నాయని, మొత్తం 4,53,51, 913 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. కేసులు పెండింగ్‌లో ఉడడానికి అనేక కారణాలు ఉన్నాయని, మౌలిక సౌకర్యాల లేమి, అనుబంధ కోర్టు సిబ్బంది కొరత, సాక్ష్యాధారాలలో సంక్లిష్టత, బార్, దర్యాప్తు సంస్థలు, సాక్షులు, కక్షిదారుల సహకారం లేకపోవడం వంటివి



కారణాలలో కొన్నని ఆయన చెప్పారు. నిబంధనలు, విధానాలు సక్రమంగా పాటించకపోవడం కూడా పెండింగ్ కేసుల కారణమని ఆయన తెఇపారు. కేసుల పరిష్కారానికి కోర్టులకు నిర్దిష్ట కాల వ్యవధి లేకపోవడం, వాయిదాలు తరచు వేయడం, కేసుల విచారణపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటివి కూడా కారణాలని ఆయన తెలిపారు.

## నేడు బడ్జెట్‌పై చర్చ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఒక్క రోజు విరామం తర్వాత శనివారం తిరిగి సమావేశం కానుంది. ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడంతో దానిపై సభ్యులు అధ్యయనం చేసి సభలో చర్చలో పాల్గొనేందుకు శుక్రవారం సెలవు ఇచ్చారు. శనివారం ఉదయం 10గంటలకు శాసనసభ, శాసన మండలి సమావేశం కానున్నాయి. ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాలు రద్దు చేసి, నేరుగా బడ్జెట్ పద్దుపై చర్చకు అవకాశం కల్పించారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి ఉభయ సభల్లో బడ్జెట్‌పై సాధారణ చర్చ జరుగుతుంది. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇస్తారు. మొదట శాసనసభలో సమాధానం ఇచ్చిన తర్వాత, మండలిలోనూ డిప్యూటీసీఎం సమాధానమిస్తారు.

# రెండు రోజులు వైన్స్ బంద్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ లో బోనాల పండుగ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, అవకతవకలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు వైన్సులు మూసి వేయాలని నిర్ణయించారు.మహంకాళీ బోనాల పండుగ ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ అంతటా.. నాన్ ప్రొప్రయిటరీ క్లబ్ లు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్ లతో సహా అన్ని వైన్స్ షాపులు మూసివేయనున్నట్లు సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.జూలై 28వ తేదీ(రేపు) ఉదయం 6 గంటల నుంచి రెండు రోజుల పాటు అన్ని వైన్ షాపులు మూతపడనున్నాయి.

# మేడిగడ్డకు భారీగా పెరిగిన వరద

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతోంది. శుక్రవారం బరాజ్ ఇన్‌ఫ్లో 9,54,300 క్యూసెక్కులకు పెరిగింది. మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రివర్ బెడ్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా ప్రస్తుతం వరద ప్రవాహం 97 ఎత్తులో మీటర్లలో ప్రవహిస్తోందని భారీ నీటి పారుదలశాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా అన్నారం బరాజ్‌కు మానేరు, కాల్వల ద్వారా 13,600 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 66 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బరాజ్‌కు 10,56,480 క్యూసెక్కుల వరద వస్తోంది. మొత్తం 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని గంగగూడెం, రాజన్నపేట, బుట్టాయగూడెం వద్ద బ్రిడ్జిలను ఆనుకొని గోదావరి బ్యాక్ వాటర్ నిలిచింది.



## మరో నాలుగు రోజులు భారీ వర్షాలు..



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ముఖ్యంగా నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మెదక్‌లో ఈదురుగాలలతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు జగిత్యాల, మెదక్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. గత 24 గంటల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో అత్యధికంగా 5.76 సెం.మీ వర్షపాతం నమోదైంది

## కాళేశ్వరానికి ఏడాదికి రూ. 15 వేల కోట్లు ఖర్చు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయవలసి వస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టు రన్నింగ్ కాస్ట్ చాలా ఎక్కువే అని అన్నారు.మేడిగడ్డపై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారని, కానీ ఈ ప్రాజెక్టును మొదలుపెట్టినప్పుడు... కూలినప్పుడు కేసీఆర్ ప్రభుత్వమే ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మేడిగడ్డ పిల్లర్లు 6 అడుగులు లోపలికి కుంగాయన్నారు. నాసిరకం గా నిర్మించడం వల్లే ఇలా జరిగిందని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. ఇప్పుడు ఆ నివేదికపై కూడా బీఆర్ఎస్ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీని కేంద్ర చట్టం ద్వారా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అక్టోబర్ 21న బ్యారేజీ కుంగిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లో అని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద ఎవరో బాంబులు పెట్టారని ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని, బ్యారేజీ కుంగినా కేసీఆర్ నోరు మెదపలేదన్నారు. ఎన్డీఎస్ సూచనల మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లు తెరుస్తామన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండు రోజుల్లో పంపింగ్ ప్రారంభిస్తామన్నారు. ఎల్లంపల్లి నుంచి పంపింగ్ మొదలుపెట్టి మిడ్ మానేరుకు నీటిని తరలిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని బీఆర్ఎస్ భారీగా పెంచిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు రన్నింగ్ కాస్ట్ కూడా చాలా ఎక్కువే అన్నారు. ప్రాజెక్టులోని అన్ని పంపులను పూర్తిస్థాయిలో రన్ చేస్తే కరెంట్ బిల్లే రూ.10 వేల కోట్లు అవుతుందన్నారు.ప్రాజెక్టు పూర్తై అన్ని మోటార్లు రన్ చేస్తే ఈ వ్యయం మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అధిక వడ్డీకి రుణాలు తీసుకున్నారన్నారు. ఏడాదికి ఈ ప్రాజెక్టు కోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేయవలసి వస్తోందన్నారు. దాదాపు రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే కాళేశ్వరం కింద కేవలం 93 వేల ఎకరాలు మాత్రమే కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్డీఎస్ఏ సలహా మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల గేట్లు తెరిచామని వివరించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గత ప్రభుత్వమే నీళ్లను వదిలిందని తెలిపారు. డీపీఆర్‌లోని అంశాలను గత కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సెంట్రల్ డిజైన్ సంస్థ ప్రకారం నిర్మాణం జరగలేదన్నారు. ఒక వ్యక్తి ఆలోచనల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని చెప్పారు. ఇంత ఘోర తప్పిదం ఎవరూ చేసి ఉండరని అన్నారు. ప్రజలకు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతోన్న వరద ప్రవాహం..





బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులు ఇప్పటికే నిండిపోగా, దిగు వకు వరదను విడుదల చేస్తున్నారు. దీంతో జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది.

జూరాలతో పాటు సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 2.58 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 109 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది.

దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 45,236 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం నుంచి విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న ప్రజలను, జాలర్లను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నది పరివా హక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రవాహన్ని దృష్టిలో ఉంచుకుని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

## తడి చేతులతో సెల్‌ఫోన్ చార్జింగ్... బాలిక మృతి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తడి చేతులతో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ విద్యుత్ షాక్‌కు గురై బాలిక మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి నామవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటికాల రామకృష్ణ దంపతులకు కూతురు అంజలి కార్తీక(9), కుమారుడు వెంకట గణేశ్ ఉన్నారు. అంజలి కార్తీక అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నది. అయితే ఉదయం తండ్రి వద్ద నుంచి అంజలి కార్తీక సెల్ ఫోన్ తీసుకున్నది. దానికి చార్జింగ్ లేకపోవడంతో తడి చేతులతో చార్జింగ్ పెడుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో కుప్పకూలింది. కొద్ది సేపటికి గమనించిన తల్లిదండ్రులు చేతులు, కాళు రుద్దినప్పటికీ స్పర్శ లేకపోవడంతో అదే గ్రామంలోని ఓ ప్రైవేటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన ఆయన... బాలిక అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించా రు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కాగా ఘటనా స్థలాన్ని ఎస్సై నాగుల్‌మీరా సందర్శించారు. తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పాకిస్థాన్‌పై శ్రీలంక గెలుపు



- ఫైనల్‌కు ఆతిథ్య జట్టు
- ఆటపట్టు కెప్టెన్ ఇన్నింగ్స్

**బలగం టీవి , కొలంబో**

సొంతగడ్డపై జరుగుతున్న మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక ఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో కెప్టెన్ చమరి ఆటపట్టు(63) సూపర్ హాఫ్ సెంచరీతో మెరిసింది. ఒత్తిడిలోనూ సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన ఆమె కీలక భాగస్వామ్యాలను నెలకొల్పు తూ పాక్ ఆశలపై నీళ్లు చల్లింది. అనుష్కా సంజీవని(24 నాటౌట్), సుగంధిక కుమారిలు(10) అద్భుతంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు.

ముందుగా భారీ ఛేదనలో ఓపెనర్ విశ్మీ గుణరత్నే(0)ను డకౌట్ చేసిన సదియా ఇక్బాల్ లంకను ఒత్తిడిలో పడేసింది. అయితే.. కెప్టెన్ చమరి ఆటపట్ట(0) పట్టువదలని యోధురాలిగా పోరాడింది. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుతూ రన్ రేట్ తగ్గకుండా చూసింది. హర్షిత సమరవిక్రమ(12), కవిష దిల్హార(17)లతో కలసి ఇన్నింగ్స్ నిర్మించింది. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ కొట్టిన ఆటపట్టు మ్యాచ్‌ను లంకవైపు తిప్పింది. లంక విజయానికి 21 రన్స్ అవసరం. ఆ తర్వాత సుగంధిక కుమారి(10) 19వ ఓవర్‌లో రెండు బౌండరీలు బాదింది. దాంతో, మొత్తం 13 పరుగులు వచ్చాయి. పాక్ సారథి నిడా దార్ వేసిన ఆఖరి ఓవర్లో 3 పరుగులు కావాల్సిన దశలో రెండో బంతికి సుగంధిక బౌల్డ్ అయింది. నాలుగో బంతికి సింగిల్ వచ్చింది. ఐదో బంతికి వైడ్.. దాంతో, స్కోర్లు సమం అయ్యాయి. ఆ తర్వాత బంతికి సింగిల్ తీసి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

దంబుల్లా స్టేడియంలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ (%ఖఃనిఆఖ్ఖఅ%) అమ్మాయిలు దంచేశారు. ఆతిథ్య శ్రీలంక బౌలర్లను ఉతికేస్తూ జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఓపెనర్లు గుల్ ఫెరోజా(25), మునీబా అలీ (37)లు శుభారంభమిచ్చి పునాది వేశారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. అయితే.. ప్రబోధని వీళ్లిద్దరిని వెనక్కి పంపి స్కోర్ బోర్డు వేగానికి అడ్డుకట్ట వేసింది.

# ఫైనల్‌కు భారత్

- 80 పరుగులు మాత్రమే చేసిన బంగ్లాదేశ్
- లక్ష్యాన్ని 11 ఓవర్లలోఊదేసిన భారత్
- రేపు ఫైనల్‌లో శ్రీలంకతో భారత్ ఢీ



**బలగం టీవి , కొలంబో**

ఆసియా కప్ 2024 తొలి సెమీ ఫైనల్ లో బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో టీమిండియా ఘనవిజయాన్ని సాధించింది. దీంతో భారత జట్టు ఫైనల్ కు దసుకెళ్లింది. ట్రోఫీని అందుకోవడానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. దంబుల్లా స్టేడియంలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో తొలుత పేసర్ రేణుకా సింగ్(3/10), రాధా యాదవ్(3/14)లు ప్రత్యర్థిని స్వల్ప స్కోర్‌కే కట్టడి చేయగా.. అనంతరం ఓపెనర్లు స్మృతి మంధానా(55 నాటౌట్), షఫాలీ వర్మ( 26 నాటౌట్)లు చితక్కొట్టారు. 11వ ఓవర్లో మంధాన హ్యాట్రిక్ ఫోర్లు బాదింది. దాంతో, హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా ఏడుసార్లు చాంపియన్ అయిన టీమిండియా మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది.

భారత బౌలర్ల దెబ్బకు బంగ్లాదేశ్ టీమ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేయగలిగింది. బంగ్లా బ్యాటర్లలో





వికెట్ కీపర్ అండ్ కెప్టెన్ నిగర్ సుల్తానా 32 పరుగులతో టాప్ స్కోరర్ గా ఉన్నారు. 81 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం 11 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. భారత బ్యాటర్లలో స్మృతి మంధాన 55 పరుగులు, షఫాలీ వర్మ 26 పరుగులతో అజేయంగా విజయాన్ని అందించారు.

**పారిస్ ఒలింపిక్స్ 2024లో అసలు ఆట జూలై 27 నుంచి మొదలు కానుంది. నేడు మన భారత అథ్లెట్లు మొత్తం 7 క్రీడల్లో పాల్గొనున్నారు. దాదాపుగా అందరూ క్వాలిఫికేషన్ రౌండ్ లేదా స్టేజ్ రౌండ్‌లో పాల్గొననున్నారు. షూటింగ్ ఈవెంట్‌లో మాత్రం మెడల్? రౌండ్ కూడా జరగనుంది.**

**జులై 27 షెడ్యూల్ వివరాలు ఇవే!**



బ్యాడ్మింటన్ :

పురుషుల సింగిల్స్ గ్రూప్ స్టేజ్ (హెచ్ ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్)

మహిళల సింగిల్స్ గ్రూప్ స్టేజ్ (పీవీ సింధు)

పురుషుల డబుల్స్ గ్రూప్ స్టేజ్ (సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి)

మహిళల డబుల్స్ గ్రూప్ స్టేజ్ (తనీషా క్రాస్టో, అశ్విని పొన్నప్ప) %–% మధ్యాహ్నం 12 గంటల నుంచి

రోయింగ్ : పురుషుల సింగిల్ స్కల్స్ హీట్స్ (బల్రాజ్ పన్వార్) %–% మధ్యాహ్నం 12:30 నుంచి

షూటింగ్ :

10మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ అర్హత (సందీప్ సింగ్, అర్జున్ బాబుటా, ఎలవెనిల్ వలరివన్, రమితా జిందాల్) – మధ్యాహ్నం 12:30 గంటలకు

10మీ ఎయిర్ పిస్టల్ పురుషుల క్వాలిఫికేషన్ (సరబ్‌జ్యోత్ సింగ్, అర్జున్ చీమా) – మధ్యాహ్నం 2 గంటలకు

10మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ మెడల్ రౌండ్‌లు –మధ్యాహ్నం 2 గంటలకు

10మీ ఎయిర్ పిస్టల్ మహిళల క్వాలిఫికేషన్ (రిథమ్ సాంగ్వాన్, మను బాకర్)– సాయంత్రం 4 గంటల నుంచి

టెన్నిస్ :

1వ రౌండ్ మ్యాచ్‌లు పురుషుల సింగిల్స్ (సుమిత్ నాగల్), పురుషుల డబుల్స్ (రోహన్ బోపన్న, ఎన్. శ్రీరామ్ బాలాజీ) – మధ్యాహ్నం 3:30 నుంచి

టేబుల్ టెన్నిస్ :

పురుషుల సింగిల్స్ (శరత్ కమల్, హర్మీత్ దేశాయ్), మహిళల సింగిల్స్ (మనికా బాత్రా, శ్రీజ ఆకుల) ప్రిలిమినరీ రౌండ్ – సాయంత్రం 6:30 నుంచి

బాక్సింగ్ :

మహిళల 54 కేజీలు (ప్రీతీ పవార్) రౌండ్ ఆఫ్ 32 – సాయంత్రం 7 గంటల నుంచి

హాకీ :

పురుషుల గ్రూప్ బి భారత్ వర్సెస్ న్యూజిలాండ్ – రాత్రి 9 గంటలకు

# సైనికుడిగా రెబల్ స్టార్ ప్రభాస్..



**బలగం టీవి , హైదరాబాద్**


ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కొత్త సినిమాకు ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. సీతా రామం సినిమాను రూపొందించిన దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా రాబోతున్నట్లు ఇంటర్నెట్‌లో వార్త వైరలవుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఒక సైనికుడి పాత్ర పోషిస్తున్నారట. ఈ సినిమా దేశభక్తికి సంబంధించిన సినిమా. ఇది ఒక ఇండియన్ మిలటరీకి సంబంధించిన కథ. ఇందులో పాకిస్తాన్ హీరోయిన్ సాజల్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ యార్నీ నవీన్, యలమంచలి రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 22న ఈ సినిమాను లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

# పావల శ్యామలకు సుప్రీమ్ హీరో ఆర్థిక సాయం

**బలగం టీవి , హైదరాబాద్**



%మెగా సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ తన గొప్ప మనసుని మరోసారి చాటుకున్నారు. దీన స్థితిలో ఉన్న నటి పావలా శ్యామలకు ఆర్థిక సాయాన్ని అందించారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పావలా శ్యామలకు ఆ ఆర్థిక సాయం అందేలా చేశారు. ఈ క్రమంలో ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మెంబర్స్ కలిసి ఆమెకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. సాయి దుర్గ తేజ్ ఇచ్చిన మాటను గుర్తు పెట్టుకుని ఇలా ఆర్థిక సాయాన్ని అందించడంతో నటి పావలా శ్యామల ఎమోషనల్ అయ్యారు. తన ధీనస్థితి గురించి చెబుతూ కన్నీరు మున్నీరు అయ్యారు. ఇక సాయి దుర్గ తేజ్‌తో వీడియో కాల్‌లో నటి పావలా శ్యామల మాట్లాడుతూ కన్నీరు పెట్టేసుకున్నారు. అన్ని విధాల అండగా ఉంటామని సాయి దుర్గ తేజ్ భరోసానిచ్చారు. అందరూ సాయం చేస్తారని, తోడుగా ఉంటారని హామీ ఇచ్చారు. 'యాక్సిడెంట్ జరిగినప్పుడు.. మీరు బాగుండాలని, ఏమీ కాకూడదని ఆ దేవుడ్ని ప్రార్థించానంటూ నటి పావల శ్యామల చెబుతూ కన్నీరు పెట్టుకున్నారు. ఆమె ప్రేమకు, మాటలకు సాయి దుర్గ తేజ్ ఎమోషనల్ అయ్యారు. ఈ క్రమంలోనే చిరంజీవి చేసిన ఆర్థిక సాయాన్ని కూడా నటి పావల శ్యామల గుర్తు చేసుకున్నారు.




# 5 భాషల్లో డబుల్ ఇస్మార్ట్

**బలగం టీవి , హైదరాబాద్**

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రాబోతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. సినిమా 5 భాషల్లో రాబోతోంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు. 'రామ్, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' విశేష ప్రేక్షకాదరణతో సంచలన విజయం సాధించింది. దీనికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్' ప్రేక్షకుల ముందుకు రానుంది.